క్లుప్తంగా

గండాలయ స్వామి కొండకు పోటెత్తిన భక్తులు

మంగళగిరి: నగరంలోని గండాలయ స్వామి కొండకు మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది తెలుగు సంవత్సరంలో చివరి అమావాస్య కావడంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే కొండకు భక్తులు పోటెత్తారు. భక్తులు బారులు తీరడంతో ఘాట్‌రోడ్డు భక్తుల వాహనాలతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్‌లో వేచి ఉండి స్వామి వారికి నూనె వడ్డించి దీపారాధన చేసి పూజలు నిర్వహించారు. కొండ ప్రాంతమంతా భక్తులతో కోలాహలంగా మారింది.

వైభవంగా గరువుకొండ భక్తాంజనేయుడి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని గరువుకొండ భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు రవిశంకర్ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్తనామ పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి గ్రామంలో ఊరేగించారు.

సీతానగరంలో అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరంలో పెండింగ్‌లో ఉన్న రహదారులు, డ్రెయిన్లు నిర్మించేందుకు కార్పొరేషన్ నిధుల నుంచి 20 లక్షలు కేటాయించారు. మంగళవారం ఎ.ఇ. కిషోర్ ఇంజినీరింగ్ సిబ్బందితో సీతానగరం చెట్టుకింద ఆంజనేయస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రియాంక, వైఎస్సార్‌సీపీ పట్టణ ఎస్టీ సెల్ నాయకులు బాలసాని అనీల్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



తాడేపల్లి రూరల్: ఓ యువకుడు కనిపించడం లేదంటూ తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. ఉండవల్లి సెంటర్ వంశీ స్కూల్ వెనుక ఉండే కుంచాల నాంచారమ్మ కుమారుడు సాయి శివరామకృష్ణ(20) కనిపించడం లేదని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. డిగ్రీ చదువుతున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు



ఫిరంగిపురం: జగనన్న స్వచ్ఛ సంకల్పం గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణకు మండలంలోని ఐదు గ్రామాలు ప్రశంసాపత్రాలు అందుకున్నాయి. మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ప్రశంసాపత్రాలు అందించినట్లు ఎంపీడీఓ దాసరి అనూరాధ తెలిపారు. వేమవరం సర్పంచి మున్నంగి శివకుమారి, పంచాయతీ కార్యదర్శి జీవీ రాధకృష్ణమూర్తి, గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు నాయక్, గుండాలపాడు ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపికృష్ణ, మునగపాడు వలంటీర్ నూర్‌మున్నీసా, బేతపూడి క్లాప్‌మిత్ర అహ్మద్, మరియు తనకు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ వివరించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే శిక్ష తప్పదు

తెనాలి టౌన్: బాల్య వివాహాలకు అనుమతి ఇచ్చేవారు, ప్రోత్సహించే వారు బాల్య వివాహ నిషేధ చట్టం కింద శిక్షార్హులని సీడీపీఓ డి.గీతాంజలి పేర్కొన్నారు. తెనాలిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సీడీపీఓ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే 1098, 181 హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెక్టారు సూపర్‌వైజర్లు కె.వెంకట లక్ష్మి, కె.సాజన్య, హిమబిందు, కె.యామిని పాల్గొన్నారు.

రాగిజావతో చిన్నారులకు ఆరోగ్యరక్ష

- విద్యార్థులకు కొత్తగా రాగిజావ అందజేత
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



మంగళగిరిలో రాగి జావ పంపిణీ చేస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



నులకపేట ఉర్దూ పాఠశాలలో రాగిజావ అందజేస్తున్న వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు

మంగళగిరి: విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు మంచి విద్యతో పాటు విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండేలా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ బడులలోని విద్యార్థులకు పౌష్టికాహారం రాగిజావను అందించడం ప్రారంభించారు. ఇప్పటికే విద్యార్థులు విసుగు చెందకుండా రోజూ ఒకే రకం కాకుండా ప్రతి రోజు జగనన్న గోరుముద్ద పేరుతో వివిధ రకాల భోజనం అందించడంతో పాటు చెక్కీ, కోడిగుడ్లు లాంటి ఆహారాన్ని ఇస్తున్నారు. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి విద్యార్థులలో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు మంగళవారం నుంచి వారానికి మూడు రోజులు మంగళ, గురు , శని వారాలు రాగిజావ అందించనున్నారు.

విద్యతో పాటు పౌష్టికాహారం

ఉన్నత విద్యతో పాటు మంచి పోషకాహారాన్ని అందించి వారిని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచడంతో పాటు ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. నగరంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం రాగిజావ పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందడంతో పాటు సమ సమాజం ఏర్పడుతుందని నమ్మిన ఏకైక నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ,హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని 45 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మంగళవారం నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాగిజావ విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నులకపేట ఉర్దూ పాఠశాలలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీతో కలిపి విద్యార్థులకు రాగిజావ అందించారు. ఎంపీపీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి, వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శాంతిపేట ఎంపీపీ పాఠశాలలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ రాగిజావను అందజేశారు.

నుదురుపాడు.. స్థానిక ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అనూష ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్ పాల్గొన్నారు. గుండాలపాడు పాఠశాలలో రాగిజావ పంపిణీ చేశారు.

దుగ్గిరాలలో..

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల నిమ్మగడ్డ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలల్లో రాగిజావ పంపిణీని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంఈఓ కాజా శ్రీనివాసరావు, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పులివర్తి పద్మ, హెచ్‌ఎం జి.బాలసుందరం పాల్గొన్నారు.

మేడికొండూరులో.

మేడికొండూరు: పేరేచర్ల లక్ష్మీనరసమ్మ కాలనీలో ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

రాయపూడిలో

రాయపూడి(తాడికొండ): మండల పరిషత్ మెయిన్ పాఠశాలలో రాగిజావ పంపిణీని హెచ్‌ఎం వల్లభాపురపు ప్రసాద్ ప్రారంభించారు. తుళ్లూరు మండలం పెదపరిమిలోని ఆది ఆంధ్రా ఎంపీపీ పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు రఘునాథరావు, ఎం.కోటిరెడ్డి, ఎ.లక్ష్మీనారాయణ రెడ్డి, డి.పోతురాజు, హెచ్‌ఎం సునీత పాల్గొన్నారు.

రాగి జావతో మేలు



గతంలో ప్రతి రోజు సాంబారు అన్నం పెట్టే సమయంలో విద్యార్థులు చాలామంది ఇళ్ల వద్ద నుంచి బాక్స్ తెచ్చుకుని తిన్నా. ఇప్పుడు వారంలో ప్రతి రోజు వైరటీ చేసి పెడుతుండడంతో ఇక్కడే తింటున్నా. చిక్కీలు, కోడిగడ్లుతో పాటు రాగిజావ ఇవ్వడం బాగుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

కె.నాగలక్ష్మి, 8వ తరగతి

పురుగు మందుల దుకాణంలో తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం శ్రీలక్ష్మీ గణపతి ట్రేడర్స్ పురుగుమందుల దుకాణాన్ని మంగళవారం ఏఓ రమణకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో వ్యవసాయశాఖ అనుమతి లేకుండా అమ్ముతున్న బయో మందులు కిసాన్ అగ్రి టెక్నాలజీకి చెందిన(ఎక్స్‌బోనస్) 11 బాటిళ్లను తనిఖీలో కనుగొన్నారు. వాటి అమ్మకానికి అనుమతి లేనికారణంగా వాటి అమ్మకాలు నిలిపివేసేలా దుకాణాదారుడికి నోటీసు అందజేసినట్లు ఏఓ రమణకుమార్ తెలిపారు. వాటి విలువ రూ.15,840 గా నిర్ధారించి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు వాటిని ఏదుకాణంలో అమ్మకూడదని అలా అమ్మకాలు జరిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో పుల్లారావు, వీఆర్యే గోపాలరావు ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలో పలువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తరుపున పార్టీ నాయకులు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. మంచికలపూడి గ్రామానికి చెందిన యార్లగడ్డ సత్యనారాయణకు రూ.25 వేలు, గాజులవర్తి డేవిడ్ రాజు రూ.15 వేలు, వృద్ధురాలు ఏసుపాగ మేరిమ్మకు రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచి వై. చంద్ర దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు డి.వెంకటేశ్వరరావు, వై. రవి, వై.చిన్నా, శివకృష్ణ పాల్గొన్నారు.


తాడేపల్లిలో...

తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ప్రాంతంలో చిరువ్యాపారం చేసుకుని జీవనం కొనసాగిస్తున్న ఐదుగురికి ఎమ్మెల్యే అందించిన టిఫిన్ బండ్లను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు అందించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు(పండు), కాపు సంఘం నాయకులు కిషోర్, తాడేపల్లి పట్టణ యువజన నాయకులు మహేష్, మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కే సుభాని, గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బోరు పంపునకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరారెడ్డి కాలనీలో మంగళవారం కార్పొరేషన్ అధికారులు బోరుపంపునకు మరమ్మతులు నిర్వహించారు. కొండ ప్రాంతంలో ఉన్న అమరారెడ్డి కాలనీలో ఉన్న బోరు గత కొంత కాలం నుంచి పనిచేయడం లేదని స్థానికులు సచివాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరమ్మతులు నిర్వహించినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి తెలిపారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవాలు



కాజలోని కోదండరామస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు



సీత సమేత కోదండరామస్వామి వార్లు

మంగళగిరి: నగరంలోని కాజలోని కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి వార్ల ఆలయ విమాన శిఖర ప్రతిష్ట, మహా కుంబాభిషేక మహోత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం వివరాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వెల్లడించారు. ఆలయ విమాన గోపురం పూర్తిగా శిథిలమైనందున దాతలు సింహాద్రి వెంకటరామారెడ్డి, స్వాతి దంపతులతో పునః నిర్మాణం చేయగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొంటారన్నారు. 22వ తేదీ ఉదయం విశ్వక్సేరాధనతో ప్రారంభమై పలు పూజా కార్యక్రమాలు, 23వ తేదీ అభిషేకాలు, పూజలు నిర్వహించి, 24న ఉదయం 10 గంటల 05 నిమిషాలకు విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని సలాం సెంటర్ నందు మంగళవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు ప్రారంభించారు. విజయవాడ వీజీఆర్ డయాబెటిస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సేవలందించారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ కె.కె.రవికుమార్, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, డాక్టర్ జె.ప్రసాద్, బాషి, శివ, జ్ఞానేశ్వరి, కె.గణేష్, రంగారెడ్డి, తరుణ్‌దేవ్, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కింద త్వరలో మొక్కలు పంపిణీ

డ్వామా పీడీ యుగంధర్



మాట్లాడుతున్న డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్

తాడేపల్లి రూరల్: ఉపాధి హామీ పథకం కింద భవిష్యత్‌లో మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం చేపడుతున్నామని డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్ దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్ మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు బాగా జరిగినట్లు వివరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాసిన డీఆర్‌పీలో ప్రతి ఒక్క పనిని పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎన్ఆర్‌జీఎస్ అధికారులు ఆనంద మోహన్, విజయలక్ష్మి, రామ్, మధుబాల, కనకారావు, లక్ష్మి పాల్గొన్నారు.

అకాల వర్షంతో అరటి రైతుకు నష్టం

మంగళగిరి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అరటి రైతులు నష్టపోయారు. అత్యధికంగా నూతక్కి, రామచంద్రాపురం, పెనుమాక, ఉండవల్లి గ్రామాలలో అరటి పంటను రైతులు సాగుచేస్తున్నారు. నేలవాలడంతో సుమారు 500 ఎకరాల నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెల 3 వ తేదీ లోగా నష్ట అంచనా పూర్తి చేసి నివేదిక అందజేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో అధికారులు ఎన్యుమరేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఏకరాకు రూ లక్షకుపైగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లకు అనుమతి తప్పనిసరి

మంగళగిరి: నగరంలో రోడ్లకు అడ్డంగా అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీలు, డివైడర్లు, ప్రైవేటు గోడలపై పోస్టర్లు అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ యు.శారదాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్యాలయాలు, దేవాలయాలు, బ్యాంకులు, వసతి గృహాలు గోడలపై యథేచ్ఛగా సినీ, తదితర వ్యాపార ప్రకటనలు అంటిస్తూ ఆయా ఆస్తులను అందవిహీనం చేయడంతో పాటు పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడే వారిపై నగర పాలక సంస్థ చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. నగరపాలక సంస్థ అనుమతించబడిన పన్ను చెల్లించిన హోర్డింగులకే పోస్టర్లు పరిమితం కావాలన్నారు. నగర పాలక సంస్థ అనుమతించబడిన ప్రకటనలను మాత్రమే ముద్రణాలయాలు (వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తయారు చేసే ప్రింటర్స్) ముద్రించాలన్నారు. పలు కూడళ్లలో రోడ్లకు అడ్డంగా బ్యానర్లు కట్టడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పెయింటింగ్స్, పోస్టర్స్ ఇష్టానుసారం నగరంలో వేస్తుండటం జరుగుతుందని చెప్పారు. ఇకపై నిరంతరం పర్యవేక్షించి అనుమతి లేకుండా అంటించే వారిపై తగు చర్యలు తప్పవన్నారు.